క్లుప్తంగా

పాఠ్యపుస్తకాలు మంజూరు



మంజూరైన పుస్తకాలు

శిరివెళ్ల: మండలానికి పాఠ్య పుస్తకాల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. రెండవ విడత కింద 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులకు 18 వేల పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయి. వాటిని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్‌లో భద్ర పరిచారు. అలాగే విద్యా కానుకల కింద 3 వేల బూట్లు కూడా వచ్చాయి. పాఠశాలలు తెరిచేలోగా అన్ని పాఠ్య పుస్తకాలు మంజూరవుతాయని ఎంఈఓ నాగార్జునరెడ్డి శనివారం తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె దారిలో వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు.ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ,శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టి విశేషంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

చిగురుతొడిగిన పచ్చదనం



క్రిష్టిపాడులోని రేగుమాను కుంట వద్ద చిగురుతొడిగిన చింతచెట్లు

దొర్నిపాడు: గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఫిబ్రవరి నుంచి విపరీతమైన ఎండలతో పచ్చదనం పూర్తిగా కనుమరుగైంది. చెట్లు ఎండి మోడుగా మిగిలాయి. అయితే ఇటీవల వర్షాలు జోరందుకోవడంతో చెట్లు చిగురు తొడుగుతున్నాయి. ఇక బయలు పొంతాలు, రోడ్డుకిరువైపులా పచ్చటి గడ్డి మొలకెత్తుతోంది. చెట్లు పచ్చదనం పులుముకొని రోడ్లపై వెళ్తున్న ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి.

దుర్గా భోగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



భోగేశ్వరంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల సమీపాన ఎర్రమల కొండలలో వెలసిన భోగేశ్వరం ఆలయంలో శనివారం ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. రుద్ర హోమం, రుద్ర పారాయణాలు, పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.

కమనీయం.. మహానందీశుడి కల్యాణం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు శనివారం కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతశర్మ, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, అర్చకులు స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగల్య ధారణ, అక్షతల సమర్పణ పూజలు కనుల పండువగా సాగాయి. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల్లో పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానందికి వచ్చిన డీఆర్‌ఓ మధుసూదన్ రావు దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు దంపతులు శనివారం రాత్రి పూజలు నిర్వహించుకున్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

తప్పిన ముప్పు

హరినగరం ఎస్ఎస్ ట్యాంక్.. ఆళ్లగడ్డ పట్టణంతో పాటు ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి మండలాల్లోని దాదాపు 41 గ్రామాల ప్రజల గొంతు తడుపుతోంది. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదాన్ని గండ్లేరు జలాశయం అడ్డుకుంది. నల్లమల అటవీ ప్రాంతంలో తెలుగు గంగ కాల్వకు అనుబంధంగా నిర్మించిన ఈ జలాశయం నీటిని హరినగరం ట్యాంక్‌కు తరలించి అక్కడ శుద్ధి చేసి ఆయా గ్రామాలకు సరఫరా చేస్తారు. గత పాలకుల ముందు చూపు కారణంగా జలాశయంలో నీటిని సమృద్ధిగా నిల్వ చేయడంతో ఈ వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తలేదు.

- వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా గత పాలకుల చర్యలు
- గండ్లేరు జలాశయాన్ని తెలుగుగంగ నీటితో నింపిన నాయకులు
- దాహం తీర్చిన హరినగరం ఎస్ఎస్ ట్యాంక్
- ఆళ్లగడ్డతో పాటు 41 గ్రామాలకు ప్రధాన నీటి వనరు



గండ్లేరు జలాశయంలో నిల్వ ఉన్న నీరు

రుద్రవరం: మండలంలోని హరినగరం ఎస్ఎస్ ట్యాంక్ ద్వారా నిరంతరం తాగునీరు సరఫరా అవుతోంది. ఆళ్లగడ్డ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తాగు నీటి ముప్పు తప్పింది. నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు జలాశయంలో సమృద్ధిగా నీరు నిల్వ ఉండటంతో మంచినీటి సమస్య తలెత్తలేదు. గతంలో తెలుగు గంగ కాల్వ నిర్మాణ సమయంలో అప్పటి ప్రభుత్వం రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మించి గండ్లేరు జలాశయంగా నామకరణం చేశారు. ప్రధాన కాల్వ నుంచి వచ్చే నీరు రిజర్వాయరుకు చేరుతుంది. రిజర్వాయరు పూర్తిగా నిండగానే దిగువకు విడుదల చేస్తారు. రిజర్వాయరు ఉండటంతో చుట్టు పక్కల ఉన్న గ్రామాలు, వ్యవసాయ బోర్లలో నీరు సమృద్ధిగా వస్తుండటంతో పంటలకు నీటి సమస్య తలెత్తేది కాదు. అలాగే మోటర్ల నుంచి నీరు సమృద్ధిగా వస్తుండటంతో తాగునీటి సమస్య ఉత్పన్నం కాలేదు. అయితే రిజర్వాయరుకు దూరంగా ఉన్న గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటినప్పుడు సమస్య నెలకొనేది. ఇందులో భాగంగానే రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లోని పలు గ్రామాలు తాగు నీటి సమస్య తీవ్రంగా ఉండేది. వేసవి వచ్చిందంటే అధికారుల్లో వణుకు మొదలయ్యేది. ఆ సమస్యను అధిగమించేందుకు ఎన్నో అవస్థలు పడేవారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేవారు. సమస్య శాశ్వత పరిష్కార దిశగా 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దాదాపు రూ.5.10కోట్లు మంజూరు చేసి హరినగరం పక్కనే ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించారు. ఆ ట్యాంక్‌కు 3.కి.మి దూరంలో ఉన్న గండ్లేరు జలాశయంలో నుంచి మోటార్ల ద్వారా నీరు సరఫరాకు ప్రత్యేక పైప్‌లైన్ వేయించారు. పనులు పూర్తి కాగానే స్వయంగా ఆయనే వచ్చి తాగునీటి సరఫరాను ప్రారంభించారు. అప్పటి నుంచి గండ్లేరు రిజర్వాయరు నుంచి నీరు హరినగరం ఎస్ఎస్ ట్యాంక్‌కు సరఫరా చేసి అక్కడ నీటిని శుద్ధి చేసి ఆళ్లగడ్డ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.



నీటిని శుద్ధి చేస్తున్న దృశ్యం

అయితే గతేడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో తాగునీటి సమస్య తీవ్రంగా పరిణమించే అవకాశముందని అధికారులు, ప్రజలు భయాందోళన చెందారు. భూగర్భ జలాలు అడుగంటి గ్రామాలు, వ్యవసాయ బోరు మోటార్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఇటు తాగునీటి సమస్యతో ప్రజలు.. మరో వైపు ఎండుతున్న పంటలతో రైతులు భయాందోళన చెందారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విడతల వారీగా పదిసార్లు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేయించారు. ఆ నీటితో గండ్లేరు జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపారు. దీంతో ఆయా గ్రామాలకు నీటి సమస్యను తలెత్తనివ్వకుండా చర్యలు తీసుకోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.



హరినగరం పక్కనున్న ఎస్ఎస్ ట్యాంక్

విధులు సక్రమంగా నిర్వర్తించండి

రుద్రవరం: అటవీ సంరక్షణలో భాగంగా విధులు సక్రమంగా నిర్వర్తించాలని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు ప్రొటెక్షన్ వాచర్లకు సూచించారు. స్థానిక అటవీ కార్యాలయంలో శనివారం ఆయన రేంజి పరిధిలోని చీతల్, ఊట్ల, నిచ్చెన్లబావి బేస్ క్యాంప్‌లతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన నాగంబావి బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా సెల్ ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అడవి ట్రాక్‌లో తిరుగుతూ అటవీ సంరక్షణకు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వేతనాలు తీసుకునేందుకు బ్యాంకు ఖాతాల నంబర్లు అందజేయాలని తెలిపారు. రుద్రవరం సెక్షన్ అధికారి నాగరాజు ఉన్నారు.

సామాన్యులను దోచుకోవడం తగదు

నంద్యాల(న్యూటౌన్): ఆర్టీసీ బస్టాండ్‌లలో మరుగుదొడ్ల వద్ద ప్రయాణికులను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని సీపీఐ నంద్యాల పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో నిర్మించిన టాయిలెట్ల ద్వారా కాంట్రాక్టర్లు సామాన్య ప్రయాణికులను దోచుకోవడం మానుకోవాలన్నారు. ఆర్టీసీ యాజమాన్యం టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పజెప్పి నిర్ణీత ధరలు నిర్దేశించినా అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా మహిళలు మూత్రవిసర్జకు వెళ్లినా డబ్బులు వసూలు చేస్తుండటం సరికాదన్నారు. శ్రీనివాసులు, సోమన్న పాల్గొన్నారు.

గడువు ముగిసిన సిలిండర్లతో జాగ్రత్త!

- సిలిండర్ వినియోగంపై అవగాహన అవసరం
- పరీక్షించిన తరువాతే డెలివరీ చేయించుకోవాలి
- నాణ్యత లేని వాటితో ప్రమాదం



కాలం చెల్లిన గ్యాస్ సిలిండర్లు

నంద్యాల(వ్యవసాయం): నిత్యం మనం వంట గదిలో ఉపయోగించే గ్యాస్ సిలిండర్‌కూ గడువు ఉంటుందన్న విషయం చాలా మందికి తెలియదు. ఏదేని సిలిండర్ లీకవుతున్నట్లు సందేహాలుంటే ఏజెన్సీకి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. కొంత మంది గ్యాస్ సిలిండర్‌ను నెలల తరబడి వాడుకుండా నిల్వ ఉంచుతారు. అలాంటి సిలిండర్‌లను సంబంధిత డీలర్‌కు తిరిగి ఇచ్చేయాలి. మరికొందరు బ్లాక్‌లో కొని మరీ వాడుతుంటారు. అయితే సిలిండర్‌లపై గుర్తించిన గడువు తేదీలోపు వాడితే ఉత్తమం. కాలం చెల్లిన సిలిండర్‌లను వాడటం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

గడువు తేదీని గమనించాలి..

ముందుగా గ్యాస్ సిలిండర్‌పై పేర్కొన్న తేదీని గుర్తించాలి. సిలిండర్‌పైన ఉండే రింగ్‌కు కింద భాగంలో గడువు తేదీ ముద్రించి ఉంటుంది. ఏడాదిలోని 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ప్రతి మూడు నెలలకు ఒక ఆంగ్ల అక్షరం చొప్పున రాసి ఉంటుంది. ఆంగ్ల భాషలోని నాలుగు అక్షరాలు ఏబీసీడీలను ఆ నాలుగు భాగాలకు ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు ఏతో, ఏప్రిల్, మే, జూన్ నెలలను బీతో, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలను సీతో, అక్టోబర్, నవంబర్ డిసెంబర్ నెలలను డీతో గుర్తిస్తారు. ఉదాహరణకు సిలిండర్‌పై బి–20 అని రాసి ఉంటే 2020 జూన్ వరకు మాత్రమే వినియోగించాలని తెలుసుకోవాలి. ఖాళీ సిలిండర్లను తయారీదారులు తమ వద్ద రికార్డులలో లేని బ్యాచ్ నంబర్ల ప్రకారం ఏడేళ్లు దాటిన వాటిని డీలర్ల నుంచి వెనక్కు తెప్పించుకొని పరీక్షించి, నాణ్యత లేని సిలిండర్‌లను పక్కన పెట్టేస్తారు. ఖాళీ సిలిండర్‌కు కూడా గరిష్టకాల పరిమితి ఉంటుంది. అయితే ఇది వినియోగదారులకు సంబంధం లేదు. ఆ నెల దాటితే సిలిండర్‌కు కాలం చెల్లిందని తెలుసుకొని దూరం పెట్టాలి.

గడువు ఉన్న సిలిండర్‌ను చూసి ఇవ్వాలి



సిలిండర్ ఇచ్చేటప్పుడు డెలివరీ బాయ్ గడువు ఉందో ముగిసిందో సరి చూసి ఇవ్వాలి. మంటలు వస్తే ఏమి చేయాలో తెలియదు. అవగాహన కల్పిస్తే గృహిణులకు ఉపయోగకరంగా ఉంటుంది. సిలిండర్ల ప్రమాదాలపై ఏజెన్సీ నిర్వాహకులు తెలియజేయాలి. అలాగే వాటి నిర్వహణ గురించి వివరిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చు.

– మహేశ్వరమ్మ, గృహిణి

పాత సిలిండర్‌లను సరఫరా చేయం

గడువు ముగిసిన సిలిండర్లను ప్రజలకు అందజేయం. ముఖ్యంగా అలాంటి సిలిండర్లను ముందుగానే పరిశీలించి కంపెనీకి పంపుతాం. వారు నాణ్యతను పరీక్షించి వినియోగించాలో వద్దో నిర్ణయిస్తారు. ఎక్కడైనా పొరపాటున గ్యాస్ సిలిండర్ తేదీ గడువు ముగిసినది అందితే తిరిగి ఇవ్వవచ్చు. వినియోగదారులు సిలిండర్ గడువు తేదీని సరి చూసుకోవాలి. గ్యాస్‌ను తక్కువగా వినియోగించేవారు. పాత సిలిండర్‌లో గ్యాస్ ఉందని వినియోగించేవారు. జాగ్రత్తలు తప్పనిసరి తీసుకోవాలి. సందేహాలుంటే మా దృష్టికి తీసుకొని రావచ్చు.

–దుర్గాప్రసాద్, ఏజెన్సీ యజమాని

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి

దొర్నిపాడు: మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ బాటలో భాగంగా చిన్నారులు, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు మంచి పౌష్టికాహారం లభించడంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బమ్మ పాల్గొన్నారు.

చాగలమర్రి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తామని, మూడేళ్లు నిండిన మీ పిల్లలను వెంటనే అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సిబ్బంది గ్రామాల్లో, వార్డుల్లో ర్యాలీలు నిర్వహిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం స్థానిక 17వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త చంద్రకళ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి 16వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. బడిబాట కార్యక్రమం ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహించాల్సిందిగా అధికారులు సూచించారు. సహాయ కార్యకర్త సుజాత, ఆశ కార్యకర్త శివలక్ష్మీ పాల్గొన్నారు.



చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మానవత్వంతో మెలగాలి

జూపాడుబంగ్లా: ప్రతి వ్యక్తిలో పరమాత్మ ఉన్నాడనే భావనతో తోటివారి ఎడల మానవత్వంతో మెలగాలని తిరుమల–తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లువెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధ్వర్యంలో గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధార్మిక సిద్ధాంతాలు, భావాలను అలవర్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. హిందూధర్మ కట్టుబాట్లకు లోబడి నిత్యం గోపూజతో పాటు దేవతామూర్తులకు దూపదీపారాధన చేయడం, ప్రాణుల ఎడల భూతదయ, మానవత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజలు నిర్వహించి శ్రీవేంకటేశ్వరస్వామివారికి సామూహిక కుంకుమార్చన తదితర విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, అర్చకులు మనోహర్, చరణ్‌సాయి, బి.రవికుమార్, పుల్లయ్యగౌడు, శ్రీనివాసులు, దర్గయ్య, నీలకంఠమాచారి, వెంకటేష్, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న 80బన్నూరు గ్రామస్తులు

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

బనగానపల్లె రూరల్: గ్రామాల్లో గొడవలు సృష్టించినా, పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రోడ్లలో పోలీసులు, ఆర్మీ బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాలు, పట్టణాల్లో అలజడులు సృష్టించేందుకు పాల్పడితే ఉపేక్షించమన్నారు. ఎన్నికల ఘట్టం ముగిసిందని, ఇంకా వాటిని దృష్టిలో ఉంచుకుని పగలు, ప్రతీకారాలు మంచివి కాదని సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారణమని, గెలుపు లేదా ఓటమి చెందిన పార్టీల కార్యకర్తలు, నాయకులు రెచ్చగొట్టుకునే విధంగా వ్యవహరించరాదని సూచించారు. ఇప్పటికైనా ప్రతిఒక్కరూ పోలీసుల చర్యలు తెలుసుకుని మసలుకోవాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామిరెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న శివశంకర్

చాగలమర్రి: ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమాన్ని ప్రభుత్వ బాధ్యతగా తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, బకాయిల చెల్లింపులు చేపట్టాలన్నారు. పీఆర్‌సీ ఆలస్యమవుతున్నందున ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 117 జీఓ రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని, మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కార్యదర్శి హుసేన్, నారాయణరెడ్డి, అంబటి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్యదర్శి గురుచంద్రుడు పాల్గొన్నారు.

కుందూనదికి జలకళ

కోవెలకుంట్ల : నైరుతి రుతుపవనాల ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పట్టణ శివారులో ప్రవహిస్తున్న కుందూనదికి జలకళ సంతరించుకుంది. సబ్ డివిజన్‌తోపాటు నది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో వాగులు, వంకలు, పొలాల్లోని నీరు కుందూలో చేరడంతో నదికి వరదనీరు పోటెత్తింది. వరి, పత్తి, మిరప తదితర పంటల సాగుకు ముందే పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉండటంతో ఊరట చెందుతున్నారు.



కోవెలకుంట్ల వద్ద ఉధృతంగా కుందూ నది

మహానంది దేవస్థానానికి ఏసీ విరాళం



దాతలతో ఈఓ, పండితులు

మహానంది: మహానంది దేవస్థానానికి కడప నగరానికి చెందిన ఎన్ఆర్ఐ సునీల్, వెంకటలక్ష్మమ్మ, జయంత్, దినేష్‌కుమార్‌లు సుమారు రూ. 50వేల విలువైన ఎయిర్ కండీషనర్‌ను విరాళంగా అందించారు. శనివారం వారు దేవస్థానానికి చేరుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డికి వాటిని అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మలు దాతలను అభినందించారు.



బియ్యం బస్తాలిచ్చిన శరభారెడ్డి దంపతులకు బాండు అందజేస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలం

మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలమని ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి అబ్బీపురం గ్రామానికి చెందిన శవ్వా శరభారెడ్డి, శవ్వా మనోహర్‌రెడ్డి సోదరులు శనివారం పది టిక్కీల బియ్యం విరాళంగా అందించారు. ఈ మేరకు శవ్వా శరభారెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మీ దంపతులను ఈఓ సన్మానించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

సిమెంట్ బల్కర్ బోల్తా

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి – భోజనం రస్తా మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున సిమెంట్ బల్కర్ (లారీ) అదుపుతప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

భయపెడుతున్న వంతెనలు

నంద్యాల(అర్బన్): పట్టణం నుంచి పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో నిర్మించిన పురాతన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ఆటోనగర్ సమీపంలో నంద్యాల–కర్నూలుకు వెళ్లే జాతీయ రహదారి పక్కనున్న వంతెన, పులిమద్ది గ్రామం వద్ద కుందూ నదిపై నిర్మించిన వంతెన, పట్టణ సమీపంలోని మద్దిలేరు వాగుపై నిర్మించిన వంతెన, భీమవరం సమీపంలో కుందూనదిపై నిర్మించిన బ్రిడ్జితో పాటు పట్టణంలోని రామకృష్ణ పీజీ కాలేజీ వద్ద పాలేరు వాగుపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. వాటికి ఇరువైపులా రక్షణ గోడలు పడిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం. ఇక వంతెనపైనున్న రహదారులు సైతం గుంతల మయం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



పులిమద్ది వద్ద కుంగిన వంతెన



ఆటోనగర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదకరంగా



గుంతలమయమైన పాలేరు వాగు వంతెన



రక్షణ గోడలు లేని భీమవరం వంతెన